

స్వామిని చూడగానే
## అన్నీ మరచిపోతా..!

- తిరుపతిలోనే నాలుగేళ్లు చదివా
- 'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాటామంతీ

- 10లో

శ్రీరామమంత్ర
## యంత్ర యాత్ర

- తిరుపతిలో ప్రారంభించిన కంచి పీఠాధిపతి
- నవంబరు 17న అయోధ్యకు చేరిక



వాళ్లూ.. వీళ్లూ కలిసి

# ఇసుక దోచేస్తున్నారు


కొట్రమంగళం స్వర్ణముఖి నదిలో ఇసుకను తరలింపు

**కీలకంగా ఓ టీడీపీ నేత**

**రాత్రికి రాత్రే బెంగళూరుకు అక్రమ రవాణా**


ఎస్ఆర్‌కండ్రిగలోని ఇనాం భూముల్లో 20 అడుగులు తవ్వేశారిలా..

**లారీ ఇసుక రూ.1.3 లక్షలు. ఒక రాత్రికి 11 లారీలు వెళతాయి. తద్వారా రూ.14.3 లక్షలు సంపాదిస్తున్నారు. ఇంత భారీగా జరిగే ఇసుక అక్రమ రవాణాలో తెరముందు కనిపించేది వైసీపీ నేతలు. తెరవెనక సూత్రధారి ఓ టీడీపీ నాయకుడు.. ఆయనకు సహకరించే మరికొందరు.**


ఇసుక అక్రమ రవాణాకోసం ప్రత్యేకంగా వేసుకున్న రోడ్డు

రేణిగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కొట్రమంగళం పంచాయతీ నుంచి జీపాళెం పంచాయతీ వరకు సుమారు 11 కిలోమీటర్లు స్వర్ణముఖి నది ఉంది. వైసీపీ హయాంలో ఇక్కడ్నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగింది. కూటమి అధికారంలోకి రాగానే మండలంలోని ఓ టీడీపీ నేత కన్ను ఇసుకపై పడింది. ఇసుక అక్రమ రవాణాలో అనుభవమున్న వైసీపీ నేతలతో ఆయన జట్టుకట్టారు. స్వర్ణముఖి నదిలో, ఇనాం భూముల్లో ఇసుకను లోడి తండ్లం, కొట్రమంగళం, ఇతర గ్రామాల సమీపంలో ఉంచి.. ఒకేసారి 11 లారీల్లో పైన పట్ట కప్పి బెంగళూరుకు తరలిస్తున్నారు. మరోవైపు వైసీపీకి చెందిన ఓ నాయకుడు టీడీపీలో చేరానని చెబుతూ ఎవరికి ఇవ్వాల్సిన వాటాలు అందిస్తూ ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ఎక్కడైనా ఇసుక లారీలను పట్టుకుంటే టీడీపీ నేత రంగంలోకి దిగి తమ వాళ్లదేనని, వదిలేయాలంటూ ఒత్తిడి తెస్తాడు. దీనికోసం పంచాయతీల స్థాయిలోనూ కొందరు నేతలను జట్టుగా పెట్టుకుని.. వారి చేతా ఒత్తిడి తెచ్చి విడిపించే పనులు చేపడతారు. ప్రైవేటు, ఇనాం భూముల్లోనూ ఇసుక కోసం 20 నుంచి 25 అడుగుల లోతుకు తవ్వేస్తున్నారు. ఇలా వాల్టా చట్టానికి తూట్లు పొడవడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ట్రాక్టర్ల నుంచీ దందా :** ఇళ్లు కట్టుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రవేశపెట్టింది. ట్రాక్టరు, ఎడ్లబండిలో తరలించే ఇసుకను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని ప్రకటించింది. దీనిని దుర్వినియోగం చేస్తూ ఇసుక మాఫియా ఒక్కో ఇసుక ట్రాక్టర్ నుంచీ నగదు వసూలు చేస్తుంది. దీనికోసం స్వర్ణముఖి నదీ తీరప్రాంతంలో డేరాలు వేసుకుని ఉంటున్నారు. మరోవైపు ఎవరైనా ఇళ్లు కట్టుకునే వారు ఇసుక ఎక్కడ తీసుకోవాలో తెలియక విక్రయదారులను సంప్రదిస్తే, డీజిల్, కూలీ, ట్రాక్టర్, నాయకులకు మామూళ్లు.. అన్నీ ఇస్తేనే పంపుతామంటున్నారు. ఇసుక డిమాండ్‌ను సృష్టించి రోజుకో రేటు చెబుతున్నారు. వీటన్నింటిపై తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ విధి విధానాలు పూర్తిస్థాయిలో తమకు అందలేదన్నారు. కొద్దిరోజుల క్రితం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోగా.. తాము ఇళ్లు నిర్మిస్తున్నామని చెబుతున్నారన్నారు.


ఇది ఇసుక లారీనే. పైన పట్ట కప్పి మరీ తరలిస్తున్నారు. ఇటీవల స్వర్ణముఖి నది నుంచి ఇసుక తీసుకొస్తుండగా సాంకేతిక సమస్యతో ఆగిపోయింది. దీనిని అధికారులు పట్టుకున్నారు. ఇసుక దోపిడీకి ఇదో నిదర్శనం.

# ఇస్కాన్ టెంపుల్‌ను పేల్చేస్తాం

- ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరుతో మెయిల్స్
- ఒకేరోజు ఐదు హోటళ్లు, రెండు ఆలయాలకు బాంబు బెదిరింపు






ఇస్కాన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇస్కాన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట ఈ మెయిల్ రావడంతో ఆందోళన నెలకొంది. ఇలా.. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని ఐదు హోటళ్లు, రెండు ఆలయాలకు మెయిల్స్ పంపారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఇస్కాన్ ఆలయాన్ని పేల్చేస్తామంటూ ఆలయంలో అతిథి గృహాలు బుక్‌చేసే ఐడీకి మెయిల్ వచ్చింది. బాంబు డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్లు, డీఎస్పీ వెంకటనారాయణ, అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ లోకేష్, నాగార్జున రెడ్డి, బీడీ టీమ్ ఇన్‌చార్జి వీరయ్య, నాగయ్య, రెడ్డెప్పనాయుడు, వినోద్‌బాబు, కిషోర్ అక్కడకు చేరుకుని గంటపాటు తనిఖీలు జరిపారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారణకు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా, ఉదయం రీనెస్ట్, తాజ్, మానససరోవర్, కెన్సస్, గోవింద హైట్స్‌తో పాటు వరాహస్వామి ఆలయానికీ బాంబు బెదిరింపులు వచ్చాయి. వరాహస్వామి ఆలయం తిరుమలలో ఉంది. దీంతో వరదరాజస్వామి ఆలయం అయి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో ఈ హోటళ్లు, ఆలయాల వద్దా తనిఖీలు జరిపారు.

**ఇది ఎవరి పని?** • తిరుపతిని టార్గెట్ చేసింది ఎందుకు? - 10లో

# భవన వసతి లేక చిన్నారుల అవస్థలు

- అరకొర భవనాల్లో అరకొర సదుపాయాలు
- మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె గదులే దిక్కు
- అసంపూర్తిగా నిర్మాణాలు

భాకరాపేట, అక్టోబరు 27: చిన్నారులకు చదువుతోపాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా నేర్పించే అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవన వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 29 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 25 మెయిన్ కేంద్రాలు కాగా నాలుగు మినీ కేంద్రాలున్నాయి. 17 కేంద్రాలకు శాశ్వత భవనాలు ఉన్నాయి. తొమ్మిది కేంద్రాలు పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో నడుస్తున్నాయి. మూడు కేంద్రాలు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న శాంతినగర్, దిగువగుంతటివారిపల్లె, చిన్నగొట్టిగల్లు-2 కేంద్రాలకు గత ఏడాది కొత్త భవనాలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభం కావడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. చిన్నగొట్టిగల్లు-2 కేంద్రంలో 17 మంది చిన్నారులు ఉన్నారు. వారితోపాటు గర్భవతులు, బాలింతలు 20 మంది కేంద్రానికి వస్తుంటారు. ప్రస్తుతం ఈ కేంద్రం హాస్టల్ భవనంలో నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే నీళ్లు ఉరుస్తున్నాయి. దీంతో గర్భవతులు, బాలింతలు అసౌకర్యానికి గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి రూ.16 లక్షలు మంజూరు కాగా అందులో రూ.13.5 లక్షలు భవన నిర్మాణానికి, రూ.2.5 లక్షలు ప్లే మెటీరియల్‌కు వినియోగించాలి. ప్రస్తుతం రూ.7 లక్షలు మాత్రమే మంజూరయ్యాఇ. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


అసంపూర్తిగా చిన్నగొట్టిగల్లు-2 అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం

## యూటీఎఫ్ మండల అధ్యక్షురాలిగా శోభారాణి



వి.శోభారాణి- శ్రీధర్ రెడ్డి

పాకాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్షురాలిగా వి.శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో ఆదివారం ఎన్నికల అధికారి పత్తిపాటి రమేష్ నాయుడు, పరిశీలకుడు సురేష్‌ల ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా జి శివప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.సురేష్ కుమార్, వి.కుసుమ, కోశాధికారిగా ఎస్.రమేష్, కార్యదర్శులుగా కె.జ్యోతి, వి.సునీకర్, జి.ధనలక్ష్మీ, జి.అబ్దుల్ సమద్, పి.చెంగల్రాయులు, ఆడిట్ కన్వీనర్‌గా బి.నరశింహులు నాయుడు, అకడమిక్ సెల్ టి.తులసమ్మ, సమీన ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, మండల విద్యాశాఖాధికారులు కె.బాబ్జీ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వోద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి: బీటీఏ


పాకాలలో సమావేశమైన బీటీఏ నాయకులు

పాకాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య కోరారు. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో ఆదివారం బీటీఏ మండల శాఖ అధ్యక్షుడు కె.జ్యోతిప్రసాద్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో బీటీఏ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ జులై 2023 నుండి అమలు కావాల్సి వుందన్నారు. పీఆర్సీ కమిటీ నియమించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వంలోని డీఏ, పీఆర్సీ బకాయిలను దశలవారిగా చెల్లించాలని కోరారు. బీటీఏ నాయకులు బి.రామమూర్తి, జి.అంజనేయులు, ఎ.కృష్ణమూర్తి, ఎన్.ఆదికేశవులు, నాగరాజ, జయబాల, రాజేంద్రుడు, వెంకటస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధ ధర్మం అందరికీ ఆచరణీయం


మాట్లాడుతున్న నాగరాజు

పాకాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బౌద్ధధర్మం, ప్రవచనాలు ఆచరణీయమని బుద్దిస్టులు నాగరాజు, సోమరాజు అన్నారు. స్థానిక గ్రంధాలయంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ అధ్యయన తరగతుల్లో భాగంగా ఆదివారం బౌద్ధ ధర్మం అంశంపై వీరు ప్రసంగించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, మనుషుల మధ్య ఉండాలంటే బుద్దుని బోధనల సారాంశం తెలుసుకోవాలన్నారు. సకల జనులు జ్ఞానవంతులు కావడానికి బుద్దుని ప్రవచనాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో రామయ్య, సుధాకర్, జ్యోతి వెంకటరత్నం, ఆనంద్, ఆదికేశవులు, మధు, నరసింహులు, అంజినేయులు, రవీంద్ర బాబు, ఉదయ్ పాల్గొన్నారు.

## ముగ్ధమనోహరం నృత్య రూపకం




తిరుచానూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం ముగ్ధ మనోహరంగా సాగింది. తిరుపతికి చెందిన శ్రీరాధిక కూచిపూడి నృత్యాలయంకు చెందిన కళాకారులు పావని, తేజశ్విని, గీతిక, జతీష, శివనందిని, రాజేవ్వరి, చరిష్మ, కోమలశ్రీ, జష్విత, రిత్విక, లాస్యప్రియ తదితరులు మూషిక వాహన, అష్టలక్ష్మి, శ్రీనివాస కల్యాణం, గరుడ గమన, నవదుర్గ, ముద్దుగారే యశోధ, స్వాగతం కృష్ణ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదర వల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

## విద్యుత్ సబ్ డివిజన్, పోలీస్ స్టేషన్లలో ఆయుధ పూజ


విద్యుత్ కార్యాలయ పూజలో పాల్గొన్న అధికారులు

చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, సబ్ స్టేషన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ల్లో ఆదివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో అన్ని విద్యుత్ పరికరాలను శుభ్రం చేసి, దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ శేషాద్రిరెడ్డి, ఏఈఈలు నాగరాజు, వెంకటరమణ, ఏఏవో శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో స్టేషన్‌లోని తుపాకీలను శుభ్రం చేసి, దుర్గామాతాకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.27 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

## శ్రీవారిసేవలో ప్రముఖులు


విద్యాదీశతీర్థ శ్రీపాద్ వాడేర్ స్వామి, ఆరణి శ్రీనివాసులు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గోకర్ణ మఠాధిపతి విద్యాదీశతీర్థ శ్రీపాద్ వాడేర్ స్వామి, నటుడు రవిప్రకాష్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, వైసీపీ ఎమ్మెల్సీ మధుసూదన్, వైసీపీ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు మాధవి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

## రైలుమార్గంలో వ్యక్తి మృతదేహం

చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైలు మార్గంలో సుమారు 45 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు శనివారం రాత్రి చంద్రగిరి, తిరుపతి రైలు మార్గంలో 98-1-3 పోస్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడు బ్లూ కలర్ ఫుల్ షర్టు, లోపల వివిధ రకాల బనియన్లు, రెండు రకాల షార్టులు ధరించి ఉన్నాడు. ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడు వివరాలకు 9440416642, 9494228854 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నేడు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రాక

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం రానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 28 మధ్యాహ్నం 1.05గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. 29న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం కలెక్టరేట్‌లో 11గంటలకు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ముక్కంటీశుడి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద బాంబే హైకోర్టు న్యాయమూర్తి మంగేష్ పటేల్ కుటుంబీకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కింటీశుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి ఎస్.మంగేష్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం అడ్డగింత

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బాల వివాహాన్ని ప్రగతి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు అడ్డుకున్నారు. బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు పెద్దలు ఏర్పాట్లు చేశారు. సమాచారం తెలుసుకున్న ప్రగతి కోఆర్డినేటర్లు రాజారెడ్డి, నారాయణ మహిళా పోలీసుతో కలిసి గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకు న్నారు. అనంతరం శ్రీకాళహస్తి రూరల్ పోలీ సులకు సమాచారం అందించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

రామచంద్రాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం రాయలచెరువుకట్టపై చెక్‌పోస్టు ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్వర్ణముఖి నది నుంచి ఇసుకను టిప్పర్లు, లారీలద్వారా ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు తరలించకూడదన్నారు. అనంతరం ఆర్‌సీపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతను లేకుండా చూస్తామని తెలిపారు. సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వంతో టీడీపీలో ప్రతి కుటుంబానికీ భరోసా


సభ్యత్వం చేయిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో ప్రతి కుటుంబానికి భరోసా లభిస్తుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. ఆర్‌సీపురం టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై డివిజనల్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలత సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం మేరకు సభ్యత్వ నమోదుచేపట్టామన్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తకు బీమా భరోసా లభిస్తందన్నారు. సభ్యత్వ నమోదును మండలంలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జనార్దన్‌చౌదరి, బిందుమాధవి, కోరా హరిప్రసాద్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామిరెడ్డి, వెంకటప్రసాద్, కోటేశ్వరరెడ్డి, జేడీ జగన్, సురేంద్రనాయుడు, మునెయ్య, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు

## కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ



గాయపడిన విద్యార్థి-డీఎస్పీ వెంకటనారాయణకు విన్నవిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి, (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటనారాయణకు ఎస్ఎఫ్ఐ నాయకులు విన్నవించారు. శనివారం ఎస్వీయూ గ్రౌండ్‌లో నిర్వహించిన మ్యూజిక్ షోకు వెళ్లిన విద్యార్థులను కానిస్టేబుల్ దూషించారని ఆరోపించారు. విచక్షణా రహితంగా కొట్టారని తెలిపారు. ఇందుకు బాధ్యులైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని చెప్పారు. చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, అశోక్, తేజ, శ్రీనివాస్, వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

## జీవకోనలో ముగిసిన మహాభారత ఉత్సవాలు



దుర్యోధన పాత్రధారి- దుర్యోధన పాత్రధారుడిని తీసుకెళతున్న భీముడి వేషధారి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవకోన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. దుర్యోధన, భీముడి పాత్రధారులు ఆకట్టుకున్నారు. సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. రాత్రి వెంకట నటరాజ నాటక మండలి తిరుపతి వారు శ్రీరామాంజనేయ యుద్ధం పద్యనాటకం ప్రదర్శించారు. ఈనెల 9న మొదలైన హరికథా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగాయి. నిర్వాహకులు అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరిని ప్రజలు అభినందించారు.

## సంస్కృత వర్సిటీకి రాజభాష నాయక్ పురస్కారం


అవార్డు రావడం పట్ల రాజభాష సమితి సభ్యులను వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభినందించారు.

తిరుపతి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత వర్సిటీకి రాజభాష నాయక్ పురస్కారం లభించింది. అండమాన్ నికోబార్ లోని పోర్ట్‌బ్లెయిర్‌లో నిర్వహించిన 43వ అఖిల భారత రాజభాష సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేశారని వర్సిటీ ఏపీఆర్వో డాక్టర్ కె.కుమార్ వెల్లడించారు. వర్సిటీలో రాజభాష సెల్‌ద్వారా హిందీభాష ప్రచార, వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని ప్రదానం చేశారని తెలిపారు. డాక్టర్ ఎ.చారుకేష్ హాజరై పురస్కారాన్ని అందుకున్నట్లు ప్రకటించారు. ప్రతిష్ఠాత్మక

## ‘క’ నాకు చాలా ముఖ్యం

సినీ హీరో కిరణ్ అబ్బవరం



తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఈనెల 31వ తేదీన విడుదల కానున్న పాన్ ఇండియా సినిమా ‘క’ తనకు చాలా ముఖ్యమని, ఈక్రమంలో స్వామి ఆశీస్సులు ఉండాలని కోరడానికి తిరుమలకు వచ్చినట్టు హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమా విడుదలకు ముందు తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం తనకు అలవాటన్నారు. ఈ సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటునానన్నారు. పెద్ద సినిమాలు విడుదల సందర్భంగా తమిళం, కన్నడ భాషల్లో సినిమా విడుదల తేదీలను మార్చినట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాగే మరో మూడు సినిమాలు కూడా ఓకే అయ్యాయని చెప్పారు

## చిరంజీవి, రవితేజతో సినిమాలు ప్లాన్ చేస్తున్నాం

- దర్శకుడు బీవీఎస్ రవి



తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి, రవితేజతో రెండు సినిమాలు ప్లాన్ చేస్తున్నామని దర్శకుడు బీవీఎస్ రవి తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సోషల్ టాపిక్‌తో ప్రజలకు ఉపయోగపడేలా చిరంజీవి సినిమా ఉండబోతుందన్నారు. చిరంజీవి వంటి సీనియర్ నటులు సోషల్ టాపిక్స్‌పై సినిమాలు చేస్తే జనం ఆదరిస్తారన్నారు. ఇటీవల నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో మొదలైన అన్‌స్టాపబుల్ షో తొలి ఎపిసోడ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారని, ఆ షో విజయవంతమైన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ స్వామిని దర్శించుకున్నట్టు చెప్పారు.

## మద్యం సీసాల స్వాధీనం

వరదయ్య పాళెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం నుంచి అక్రమంగా కొనుగోలు చేసి పల్లెలో విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. దొరవారిసత్రానికి చెందిన సుబ్రహ్మణ్యం శనివారం రాత్రి వరదయ్యపాళెం లోని ఓ మద్యం దుకాణం నుంచి 25 మద్యం సీసాలను కొనుగోలు చేసి బెల్టు దుకాణంలో విక్రయించడానికి తరలిస్తుండగా ఎస్ఐ సిబ్బందితో దాడులు చేశారు.

## 1న సామూహిక కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆ ధ్వర్యంలో నవంబరు 1న సామూహిక కేదార గౌరీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ మండపంలో ఉదయం 7గంటల నుంచి వ్రతం జరుగుతుందన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల 2004-05 సంవత్సర టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యను నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా అప్పటి ప్రధానపాధ్యాయులు రాఘవయ్య, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రాజవేలు, ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. తమ చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఏర్పేడులోని పోలీస్‌స్టేషన్ వద్ద 2017లో ఇసుక అక్రమ రవాణాపై పోరాడుతూ లారీ ప్రమాదంలో మృతి చెందిన 16మంది రైతుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

## 104 సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బకాయి వేతనాలను చెల్లించి 104 సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపాలని సీఐటీయూ అనుబంధ 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత మూడు నెలలుగా జీతాలు అందక అప్పు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2005 నుంచి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని... 2020 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో కోశాధికారి భువనేశ్వరి, మురళీమోహన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## డీఎస్సీ పరీక్ష ఒకేరోజు నిర్వహించాలి



నారా లోకేష్‌కు పోస్టు కార్డులు రాస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

తిరుపతి విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్షను ఒక్కో జిల్లాలో ఒకే రోజు నిర్వహించాలని అభ్యర్థులు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆపస్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీఎస్సీ కోచింగ్ సెంటర్ల అభ్యర్థులతో పోస్టుకార్డులు, ఈ-మెయిళ్ల ద్వారా వినతులు పంపారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ ప్రతిసారీ జిల్లాల వారీగా 12 పేపర్లను ఆరు రోజుల పాటు వివిధ సెషన్లుగా పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈసారి అలాకాకుండా ఒక జిల్లాలోని అభ్యర్థులకు ఒకేరోజు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సెంటర్లు చాలకపోతే పక్క జిల్లాలో కేటాయించాలని కోరారు. అలాగే అభ్యర్థుల మార్కులను నార్మలైజేషన్ పేరుతో ప్రకటించడం వల్ల మెరిట్ అభ్యర్థులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని, అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, సహాధ్యక్షులు డాక్టర్ ఎం. దేవరాజులు, నాయకులు కాంతారావు, మల్లికార్జునరావు, హిమగిరి పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక విభావరి



తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన శ్రీవేంకటేశ్వర నాట్యమయూరి సంస్థ టీటీడీ సౌజన్యంతో ఆదివారం మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక విభావరి అలరించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు, భక్తి గీతాలతో ప్రేక్షకులను అలరించారు. సంస్థ అధినేత కోటి, రవినాయుడు కళాకారులను జ్ఞాపిక, శాలువతో సత్కరించారు. లక్ష్మీతులసి మొక్కలను అందజేశారు. సంస్థ నిర్వాహకులు కామెడీ శాస్త్రి, కేశవ, వినుకొండ రవి, హరిత, విద్యావేత్త ఎంపీ రవికుమార్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతుల్లో అరటి సాగు లాభదాయకం

● ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్



తిరుపతి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో అరటి పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్ తెలిపారు. తిరుపతిలోని చీనీ, నిమ్మ పరిశోధనా స్థానంలో అఖిల భారత సమన్వయ ఫల పరిశోధనా సంస్థ, ఉద్యాన వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సీ సబ్ ప్లాన్ కింద అన్నమయ్య జిల్లాలోని ఓబులవారిపల్లె మండలానికి చెందిన ఎస్సీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పురుగు మందులు, నీటిలో కరిగే ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో అరటి సాగు, చీడ, పీడల నివారణపై అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి, శాస్త్రవేత్తలు డాక్టర్ రంజిత్, డాక్టర్ తనూజ, డాక్టర్ కవిత, టెక్నికల్ పర్సన్ గోపి, పెద్ద ఓరంపాడు, రాళ్లచెరువు పల్లె, గోవిందపల్లె పంచాయతీలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# జీఎస్టీ ఉన్నవాళ్లకే టపాసుల లైసెన్సు



క్రాకర్స్ అసోసియేషన్‌తో ఆర్డీవో సమావేశం

తిరుపతి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు జీఎస్టీ ఉన్న వాళ్లకే టపాసుల లైసెన్సులు ఇవ్వాలని తిరుపతి ఆర్డీవో బి.రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ షాపులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తిరుపతిలో 60 షాపుల ఏర్పాటుకు క్రాకర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. రైతుబజారు సమీపంలోని హథిరాంజీ మఠం స్థలంలో 16, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 23, డీబీఆర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 25 షాపులు ఏర్పాటు చేయనున్నారు. నిర్దేశించిన అద్దెతో పాటు జీఎస్టీ కింద ప్రతి షాపునకు రూ.60వేలు చెల్లించిన వాటికి లైసెన్సులు మంజూరు చేశారు. లైసెన్సు పొందినవారు ఆయా ప్రాంతాల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి అన్ని చోట్ల టపాసుల విక్రయాలు జరగనున్నాయని ఎస్వీ క్రాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేసీ యోగానంద్ చెప్పారు. హోల్‌సేల్ గోడౌన్ల ధర కన్నా తక్కువకే వినియోగదారులకు అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఫైర్, మున్సిపల్ అధికారులు, క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు పి.హేమకుమార్, కె.సురేష్, చక్రపాణి, సీపీఎం నేత సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## నేడు టీటీడీ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

ఉదయం 7 నుంచి 2 గంటల వరకు పోలింగ్

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. 24 (తిరుమల 10, తిరుపతి 14) కేంద్రాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. ఎన్నికల బరిలో 35 మంది ఉన్నారని చెప్పారు. తిరుమలలో 2,542 మంది, తిరుపతిలో 3,807 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. 125 మంది అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారని తెలిపారు. పోలింగ్ సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, నిర్ణీత సమయంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభిస్తామని చెప్పారు.

## డాక్టరేట్ ప్రదానం



దుర్గ

తిరుపతి, (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ బయో టెక్నాలజీ స్కాలర్ ఆర్.దుర్గ డాక్టరేట్ పొందారు. ఎఫెక్ట్ ఆఫ్ సెలెక్టెడ్ ప్రొబయోటిక్స్ ఆన్ ద ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ టార్గెట్ జీన్స్ ఇన్ బ్రెస్ట్ క్యాన్సర్ అంశంపై డాక్టర్ సునీత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

## విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ స్టేడియంలో శనివారం జరిగిన కార్తీక్ మ్యూజిక్ షో తిలకించడానికి వచ్చిన విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్ రవినాయుడితో పాటు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరపాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## స్టార్ కృష్ణపై చర్యలు తీసుకోవాలి

దళిత సంఘాల డిమాండ్

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలను దుర్భాషలాడడమే గాక బెదిరింపులకు పాల్పడిన స్టార్ కృష్ణ అలియాస్ కాకి కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు ఉమాదేవి, హేమావతి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తాము ఓ సమస్యపై ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా రోడ్డులేని భూమిని కొనుగోలు చేసి తాను నష్టపోయానని, తగిన సొమ్ము వెనక్కు ఇవ్వకపోతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని స్టార్ కృష్ణ అక్కడ ఓ రైతును బెదిరించడం చూశామన్నారు. రైతు జరిగిన విషయాన్ని తమకు వివరించారన్నారు. రైతును ఇబ్బంది పెట్టడం సరికాదన్నందుకు తమపై స్టార్ కృష్ణ దౌర్జన్యానికి దిగి, దుర్భాషలాడాడని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వడమాలపేట మండలం ఎస్‌వీపురం దళిత మహిళలు ఎ.మణెమ్మ, కె.మంజుల, సి.నాగేశ్వరి, ముని, వెంకటరమణలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీనివాసం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. తిరుపతి ఎర్రమిట్టకు చెందిన సూర్యకుమార్(23) సిద్ధార్థ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం స్నేహితులు సంజయ్, సందీప్‌తో కలసి కారులో వెళుతున్నారు. అతివేగం కారణంగా శ్రీనివాసం ఎదురుగా ఉన్న శ్రీనివాస సేతు 39వ పిల్లర్‌ను అదుపుతప్పి ఢీకొట్టారు. ఈ ఘటనలో కారులో ఉన్న సూర్యకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఈస్ట్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చేతికి అందివచ్చిన కుమారుడు మరణించడంతో ఆ కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## పరదాలతో సరి



మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీ కూలి ఏడాదైంది. అప్పట్నుంచి ఇలా గోనెసంచులు, పరదాలు కట్టి సరిపెట్టారు. ఇక్కడ 2013లో మినీ ఆర్టీసీ డిపో, గ్యారేజీ నిర్మించారు. కాశిరాయితో ప్రహరీ నిర్మించారు. కొండ నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి గోడ పునాదుల వరకు మట్టి కొట్టుకుపోయింది. గతేడాది భారీ వర్షానికి మెకానిక్ సెక్షన్ వెనుక వైపు గోడ కూలింది. అప్పట్లో సిబ్బంది తాత్కాలికంగా పరదాలు, గోనె సంచులు కట్టారు. రేకులు అడ్డుగా పెట్టారు. ఇలా.. ఏడాదిగా సరిపెట్టేశారు. రాత్రిపూట ఎలుకలు, పాములు వస్తున్నాయని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

## రోడ్లపైనే పార్కింగ్

నిత్యం రద్దీగా ఉండే తిరుమల బైపాస్ రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. లీలామహల్ కూడలి నుంచి ప్రకాశం పార్కు వరకు రోడ్డుకు రెండువైపులా కార్లు, ఆటోలు, మినీ బస్సులు బారులు తీరుతున్నాయి. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

- తిరుపతి (లీలామహల్), ఆంధ్రజ్యోతి





# స్వామిని చూడగానే అన్నీ మరచిపోతా..!

## 'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ మాటామంతీ




'స్వామిని ఏవేవో కోరుకోవాలని లిస్ట్ పెట్టుకుని వెళ్తా. తీరా ఆయన్ను చూడగానే అన్నీ మర్చిపోతా. ఏమీ కోరుకోను. నువ్వు ఇచ్చినవాటికి సంతోషంగా ఉన్నాను.. ఇంకా ఇస్తే ఆనందంగా తీసుకుంటా.. స్వామి ఆశీర్వాదముంటే చాలనుకుంటా. స్వామిని దర్శించుకుంటే ఒక పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది' అని సినీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నారు. పలు తమిళ సినిమాల్లో కథానాయికగా రాణిస్తున్న ఈమె తెలుగులో 'టక్ జగదీష్'లో మరదలుగా, 'కౌసల్య కృష్ణమూర్తి'లో కూతురిగా, 'వరల్డ్ ఫేమస్ లవర్‌లో' భార్యగా, 'రిపబ్లిక్'లో ఎన్ఆర్ఐగా.. ఇలా పలు సినిమాలతో ప్రేక్షకుల్లో ముద్ర వేసుకున్నారు. తిరుమలేశుడిని దర్శించుకున్న ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

### నాలుగేళ్లు తిరుపతిలోనే చదివా

తిరుపతితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నాన్న రాజేష్ హీరో, అమ్మ కొరియోగ్రాఫర్. అమ్మ, మోహన్‌బాబు గారు మంచి స్నేహితులు. దీంతో మా అన్నలతో కలిసి ఇక్కడే శ్రీవిద్యానికేతన్‌లో నాలుగో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు చదువుకున్నా. సెలవులొస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపేది తిరుమలలోనే. ఇప్పుడంటే వీఐపీ బ్రేక్ దర్శనం. చిన్నప్పుడు దర్శనానికి ఎనిమిది గంటల పాటు క్యూలైన్లలో నిలబడేదాన్ని. అన్ని గంటల పాటు వేచి స్వామిని చూడగానే అద్భుతమైన వైబ్రేషన్స్ వస్తాయి. మా అత్త శ్రీలక్ష్మితో (హాస్య నటి) మొదటిసారి వచ్చి స్వామిని దర్శించుకున్నా.

### దీపం వెలిగించాకే అడుగు బయటకు

నన్ను వీఐపీ బ్రేక్ దర్శనం స్థితికి తీసుకొచ్చింది స్వామే నని నమ్ముతాను. పెద్ద భక్తురాలిని కానుగానీ షూటింగ్ సమయాల్లోనూ సమీపంలోని ఆలయాలకు వెళ్తుంటాను. దీపం వెలిగించకుండా బయటకు వెళ్లను. తిరుమల చాలా ఇష్టం. దర్శించుకున్నప్పుడల్లా రెండు మూడు కోరికలు చెప్పు కోవాలనుకుంటాను. స్వామి దగ్గరికి వెళ్లగానే ఒక ట్రాన్స్‌లో ఉండిపోతాను.

### స్వామి అనుగ్రహం ఉంటేనే రాగలం

స్వామి అనుగ్రహం ఉంటేనే ఇక్కడికి రాగలమని నమ్ముతాను. చిత్తూరులో కార్యక్రమంలో పాల్గొనే క్రమంలో స్వామిని దర్శించుకోవాలనుకున్నా. హైదరాబాద్‌లో షూటింగ్ ఉండటంతో దర్శనానికి వెళ్లలేనేమో అనుకున్నా. అనుకోకుండా షూటింగ్ రద్దయింది. చిత్తూరులో కార్యక్రమానికి ముందురోజే వచ్చి స్వామిని దర్శించున్నాను.

### పదేళ్లలో చూడని పాత్రలో నటిస్తున్నా

నాది తెలుగులో చివరి సినిమా 'రిపబ్లిక్'. మంచి సినిమా కోసం రెండేళ్ల పాటు వెయిట్ చేశా. తెలుగు సినిమాల కథలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అది చాలా మంచి పాత్ర. గత పదేళ్లలో తెలుగు సినిమాల్లో ఇలాంటి పాత్ర అనేది లేదు. చాలా ఇష్టపడి చేస్తున్నా. గోదావరి అమ్మాయి క్యారెక్టర్. ఎక్కువ భాషలు రావడంలో ఇండస్ట్రీలో కంపర్టబుల్‌గానే ఉంది.

### ఈ జనరేషన్ చాలా స్మార్ట్

ఇప్పటి అమ్మాయిలు చాలా స్మార్ట్. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోలతో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. సరిగా వినియోగించుకుంటే మంచి అవకాశాలొస్తాయి. సోషల్ మీడియా పవర్‌ఫుల్ కదా. రీల్స్ బాగా చేస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. ఇటీవల ప్రభాస్ సినిమాలో కూడా ఓ అమ్మాయి హీరోయిన్‌గా ఇలాగే ఎంట్రీ ఇచ్చింది. పదేళ్ల ముందంటే ఓ ఫొటో పట్టుకుని అవకాశాల కోసం తిరిగేవాళ్లం. అందుకే ఈతరం వాళ్లు అదృష్టవంతులంటాను.





యంత్రానికి పూజలు చేస్తున్న శంకర విజయేంద్ర - యాత్రను ప్రారంభిస్తున్న శంకర విజయేంద్ర, జేఈవో వీరబ్రహ్మం

# శ్రీరామమంత్ర యంత్ర యాత్ర ప్రారంభం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ మంత్ర యంత్ర యాత్ర ఆదివారం తిరుపతిలో ప్రారంభమైంది. వినాయకనగర్‌లోని కంచి మఠం వద్ద కంచి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర ఆ యంత్రానికి పూజలు నిర్వహించి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి యాత్రను ప్రారంభించారు. విజయేంద్ర మాట్లాడుతూ కంచి ఆలయంలోని శ్రీరామమంత్ర యంత్రాన్ని పోలిన యంత్రాన్ని బంగారంతో తయారు చేయించి అయోధ్య ఆలయంలో యాగపూజలో ఉంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఈ మహామంత్ర యంత్రం ప్రత్యేక వాహనంలో బయలుదేరిందని, ఐదు రాష్ట్రాల మీదుగా 2వేల కిలోమీటర్లు ప్రయాణించి నవంబరు 17వ తేదీన అయోధ్య చేరుకుంటుందని వివరించారు. నవంబర్ 18 నుంచి 2025 జనవరి ఒకటి వరకు అయోధ్యలో లక్ష చండీ విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరాముడు జన్మించిన అయోధ్యకూ, కంచికీ పురాతన కాలం నుంచి సంబంధముందని, రాముల వారి జననం కోసం దశరథుడు కంచికి వచ్చి, వారం రోజులు అమ్మవారిని ప్రార్థించాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అయోధ్యలో నిర్మించిన బాలరామాలయం వృద్ధిలోకి రావడానికి కంచి మఠం భక్తులు కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుమల తరహాలో అయోధ్యలోనూ ధర్మం, దానం, తపస్సు వంటి హైందవ ధర్మ విధులు మరింత పటిష్ఠంగా నిర్వహించడానికి కంచి మఠం కృషి చేస్తోందన్నారు. తిరుపతి కంచి మఠం కేంద్రంలో ఆదివారం నుంచి ఆయుర్వేద చికిత్స కేంద్రం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇది ఎవరి పని?

- తిరుపతిని టార్గెట్ చేసింది ఎందుకు?
- వరసగా బాంబు బెదిరింపు ఈ మెయిల్స్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లు, రెండు ఆలయాలు, రేణిగుంట విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తీర్థకట్టవీధి ప్రాంతాలకు బెదిరింపులు తప్పలేదు. ఇదంతా ఎవరు చేస్తున్నారు? తిరుపతినే ఎందుకు టార్గెట్‌గా చేసుకున్నారనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు రేణిగుంట విమానాశ్రయానికి ఈ వారం రోజుల్లోనే మూడు సార్లు ఇదే రకం మెయిల్స్ వచ్చాయి. విమానాలనూ వదల్లేదు. ఇక, నాలుగు రోజుల నుంచీ తిరుపతిలోని హోటళ్ళకు వరుస బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీంతో బెదిరింపు మెయిల్స్ వస్తుండడంతో పోలీసులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడం.. తిరుపతిలో ఏం జరిగినా దేశవ్యాప్తంగా తెలిసే అవకాశం ఉండటంతో నగరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. 'తమిళనాడులో టెర్రరిస్టు జాఫర్ సాదిక్‌కు జైలు శిక్ష పడటానికి ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ సహకారం అందించడం మాకు నచ్చలేదు. ఆ రాష్ట్రంతో పాటు తమిళనాడుకు దగ్గరగా ఉన్న పుణ్యక్షేత్రమైన తిరుపతిలోని పలు హోటళ్లను కూడా పేల్చేస్తాం' అని మెయిల్‌లో దుండగులు పేర్కొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా మెయిల్స్‌పై లోతుగా, సమగ్రంగా దర్యాప్తు చేసే సంస్థలు, వ్యవస్థలు స్థానికంగా అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో బెదిరింపు మెయిల్స్ వచ్చినప్పుడు హడావుడిగా ఘటనా స్థలాలకు వెళ్ళడం, తనిఖీలు చేయడం వరకే పరిమితం అయ్యే పరిస్థితి ఉంది.

### ఏర్పేడులో మూడు కేసులు నమోదు

రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్‌పై ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు .. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన మెయిల్స్, బెంగళూరుకు వచ్చిన మెయిల్ ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం. కోల్‌కత్తాలోని మిత్రా అనే వ్యక్తి ఇలాంటి ఫేక్ మెయిల్స్ వస్తున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత.. ఇక్కడి పోలీసులూ బెంగళూరు వెళ్లి మెయిల్స్‌ను క్రాస్ చెక్ చేసుకుని రెండూ ఒకే తరహాలో ఉంటే అతడిని పీటీ వారెంట్‌పై తిరుపతికి తీసుకురానున్నారు. ఈ మేరకు ఓ పోలీసు అధికారి చెప్పారు.

# ప్రభుత్వ భూమికి కంచె





గతంలో చదును చేసిన ప్రభుత్వ భూమికి వేసిన కంచె

వడమాలపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బాలినాయుడు కండ్రిగ పంచాయతీలోని బంగారెడ్డి కండ్రిగ ఎస్టీ కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. సుమారు నాలుగు ఎకరాలను చదును చేసి ఏకంగా కంచె వేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 100 ఎకరాలకు పైగా గుట్ట పోరంబోకు భూములను చదును చేయడాన్ని ఎస్టీ కాలనీవాసులు అడ్డుకున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఫిబ్రవరి 8న 'గుట్ట పోరంబోకును ఆక్రమిస్తున్నారు' అంటూ కథనం ప్రచురితమైంది. అప్పట్లో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పెట్టారు. ప్రస్తుతం ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. నాలుగు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేశారు. షెడ్డూ నిర్మించారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే భానుప్రకాష్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణను తొలగించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు సూచించారు. రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు ఆ భూమిలో మొక్కలు పెంచడానికి సమాయత్తమవుతున్నారు.



## కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,298మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,690మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,148మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 895, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 219మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 49మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 14,938 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

### బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్ సైనిక్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 2న జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష జరుగనుందని వివరించారు. 2013 జూన్ 1 నుంచి 2015 మే 31 మధ్యకాలంలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. మేథమేటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, ప్రొఫిషియెన్సీ టెస్ట్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999లలో సంప్రదించాలని కోరారు.

## కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ



చంద్రగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్థంభానికి, ఆంజనేయస్వామి వారికి పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈమూడు రోజులు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్జిత కల్యాణోత్సవ సేవ రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్ వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

- సైన్స్‌సెంటర్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని, మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, సైన్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి-2024 టాలెంట్ టెస్ట్ స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన 60 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులు ఈ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. బాలాజీ, శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలన్నారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదికను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీహరికోట స్పేస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో గూడూరు జీవీఎస్ శంకరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరు వచ్చేనెల 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు చెంగయ్య, రఫీ, లక్ష్మీనారాయణ, మణికంఠ, ఫిజికల్ సైన్స్ ఫోరం మేగనాథ్, రోటరీ క్లబ్ రవికుమార్, తిరుపతి బాలోత్సవం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో విజేతలు



## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన విజయసాగర్

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - స్వర్ణముఖినది సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణానికి చెందిన విజయసాగర్ (34) టైల్స్ నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం స్వర్ణముఖినది వద్ద మృతి చెంది ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఇళ్ల మధ్య గోదాములు... ఇబ్బందుల్లో వాహన చోదకులు


మిరియాలబాబా ఆశ్రమం వద్ద సరుకు దింపేందుకు లారీ రావడంతో ఇరుకుపోయిన ఆటో

రేణిగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గృహ సముదాయాల నడుమ గోదాములు ఉండడంతో ద్విచక్ర వాహన దారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని కొన్ని వీధుల్లో మొదట్లో దుకాణంగా ఉన్నవి నేడు గోదాములుగా మారాయి. దీంతో ఆ గోదాములకు సరుకు లారీలు పగటిపూట ఇరుకు వీధుల్లో రావడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. ఈ విషయంపై గ్రామసభలో స్థానిక నాయకులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు అధికారులు చర్యలకు ఉపక్రమించ లేదు. ఇప్పటికైనా గృహ సముదాయాల్లో ఏర్పాటు చేసి గోదాములను ఖాళీ చేయించాల్సి ఉంది.

## ఇలా దాహం తీర్చుకోవాల్సిందే



మూలనపడ్డ వాటర్ ప్లాంట్ - కుళాయి వద్ద తట్టలతో నీరు తాగుతున్న విద్యార్థులు

సత్యవేడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. విద్యార్థులకు దాహం వేసినా, మధ్యాహ్న సమయంలో భోజనం వేళ నీరు తాగాలన్నా కొళాయి వ వెళ్ళి తట్టలతో పట్టుకుని తాగాల్సిందే. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఉన్నప్పటికీ అది వినియోగంలోకి లేకపోవడంతో విద్యార్థులకు ఈ అవస్థలు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో భాగంగా ఈ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నిర్వాహణను గాలి కొదిలేసింది. దీంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ మూలన పడింది. అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

## జు జీట్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జు జీట్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ చూపారు. నెల్లూరు జిల్లా కావలిలో పట్టణంలో జరిగిన జు జీట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సింహపూరి కరాటే అకాడమీ కోచ్ ధనుష్ ఆధ్వర్యంలో నాలుగు పతకాలు సాధించారు. జోషిత్ 45 కిలోల విభాగంలో, లిఖిత 42 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా 28 కిలోల విభాగంలో క్లారిస్, నమస్వి కాంస్య పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

## మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రాగిపట్లు రాఘవయ్య

వరదయ్యపాళెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నవంబరు 4న తిరుపతి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని సమితి మండల అధ్యక్షుడు దొరబాబుమాదిగ, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాఘవయ్య కోరారు. మండలంలోని పాండూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో అమలు జరిగేంత వరకు మాదిగలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. బాలకుమార్, సురేష్, సుబ్బయ్య, మౌళి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతుల్లో అరటి సాగు లాభదాయకం

తిరుపతి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో అరటి పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ గోపాల్ తెలిపారు. తిరుపతిలోని చీనీ, నిమ్మ పరిశోధనా స్థానంలో అఖిల భారత సమన్వయ ఫల పరిశోధనా సంస్థ, ఉద్యాన వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సీ సబ్ ప్లాన్ కింద అన్నమయ్య జిల్లాలోని ఓబులవారిపల్లె మండలానికి చెందిన ఎస్సీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పురుగు మందులు, నీటిలో కరిగే ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల్లో అరటి సాగు, చీడ, పీడల నివారణపై అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి, శాస్త్రవేత్తలు డాక్టర్ రంజిత్, డాక్టర్ తనూజ, డాక్టర్ కవిత, టెక్నికల్ పర్సన్ గోపి, పెద్ద ఓరంపాడు, రాళ్లచెరువు పల్లె, గోవిందపల్లె పంచాయతీల రైతులు పాల్గొన్నారు.

## డీఎస్సీ పరీక్ష ఒకేరోజు నిర్వహించాలి

### విద్యాశాఖ మంత్రికి పోస్టుకార్డుల ద్వారా వినతి

తిరుపతి విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్షను ఒక్కో జిల్లాలో ఒకే రోజు నిర్వహించాలని అభ్యర్థులు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆపస్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీఎస్సీ కోచింగ్ సెంటర్ల అభ్యర్థులతో పోస్టుకార్డులు, ఈ-మెయిళ్ల ద్వారా వినతులు పంపారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ ప్రతిసారీ జిల్లాల వారీగా 12 పేపర్లను ఆరు రోజుల పాటు వివిధ సెషన్లుగా పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈసారి అలాకాకుండా ఒక జిల్లాలోని అభ్యర్థులకు ఒకేరోజు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సెంటర్లు చాలకపోతే పక్క జిల్లాలో కేటాయించాలని కోరారు. అలాగే అభ్యర్థుల మార్కులను నార్మలైజేషన్ పేరుతో ప్రకటించడం వల్ల మెరిట్ అభ్యర్థులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని, అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, సహాధ్యక్షులు డాక్టర్ ఎం.దేవరాజులు, నాయకులు కాంతారావు, మల్లికార్జునరావు, హిమగిరి పాల్గొన్నారు.

## స్టార్ కృష్ణపై చర్యలు తీసుకోవాలి

### దళిత మహిళల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న దళిత మహిళలు

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలను దుర్భాషలాడడమే గాక బెదింపులకు పాల్పడిన స్టార్ కృష్ణ అలియాస్ కాకి కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు ఉమాదేవి, హేమావతి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తాము ఓ సమస్యపై ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా రోడ్డు లేని భూమిని కొనుగోలు చేసి తాను నష్టపోయానని, తగిన సొమ్ము వెనక్కు ఇవ్వకపోతే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని స్టార్ కృష్ణ అక్కడ ఓ రైతును బెదిరించడం చూశామన్నారు. రైతు జరిగిన విషయాన్ని తమకు వివరించారన్నారు. రైతును ఇబ్బంది పెట్టడం సరికాదన్నందుకు తమపై స్టార్ కృష్ణ దౌర్జన్యానికి దిగి, దుర్భాషలాడాడని తెలిపారు. దళిత నాయకుడిగా చెప్పుకుంటూ ఆయన ఎన్నో ఆస్తులు కూడబెట్టుకున్నాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వడమాలపేట మండలం ఎస్‌వీపురం దళిత మహిళలు ఎ.మణెమ్మ, కె.మంజుల, నాగేశ్వరి, ముని, వెంకటరమణ పాల్గొన్నారు.

### ఆయాలకు జీతాలు పెంచండి

వెంకటగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు వండ్లపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజమ్మ, నిర్మల, సుశీల తదితరులు పాల్గొన్నారు.

### వెంకటగిరిలో కార్డెన్ సెర్చ్

### 12 బైకులు, 4 ఆటోల స్వాధీనం

వెంకటగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని జగనన్న కాలనీలోని టిడ్కో ఇళ్లల్లో పోలీసులు ఆదివారం తెల్లవారుజాన కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తగిన పత్రాలు లేని 12 బైకులు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమణ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు.

### వేమిరెడ్డి నియామకం హర్షణీయం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విదేశాంగశాఖ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నియమితులు కావడం పట్ల టీడీపీ నేత కట్టా రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేమిరెడ్డికి మాత్రమే ఈ అవకాశం లభించడం సంతోషదగ్గ విషయమన్నారు.

### ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆది వారం ప్రత్యేక పూజలు జరి గాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవే ద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

### అన్నదానం

గూడూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్య సాయిబాబా ఆలయంలో సత్య సాయిసేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయి బాబాకు పూజలు, భజనలు నిర్వహిం చారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, తిరుపా లయ్య, సురేష్‌బాబు, ఆనంద్, మల్లికార్జున, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

### సత్తా చాటండి


జగన్నాథంనాయుడును సన్మానిస్తున్న క్రీడాకారులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సత్తా చాటాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చైర్మన్ బొల్లినేని జగన్నాథం నాయుడు సూచించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నంద్యాలలో నవంబరు 8, 9, 10వ తేదీల్లో జరిగే సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలవాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. అనంతరం ఆయన్ను క్రీడాకారులు సన్మానించారు.

### కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోండి

తిరుపతి, (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటనారాయణకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విన్నవించారు. శనివారం ఎస్వీయూ గ్రౌండ్‌లో నిర్వహించిన మ్యూజిక్ షోకు వెళ్లిన విద్యార్థులను కానిస్టేబుల్ దూషించారని ఆరోపించారు. విచక్షణా రహితంగా కొట్టారని తెలిపారు. ఇందుకు బాధ్యులైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని చెప్పారు. చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, అశోక్, తేజ, శ్రీనివాస్, వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

### నేడు టీటీడీ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. 24 (తిరుమల 10, తిరుపతి 14) కేంద్రాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. ఎన్నికల బరిలో 35 మంది ఉన్నారని చెప్పారు. తిరుమలలో 2,542 మంది, తిరుపతిలో 3,807 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. 125 మంది అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారని తెలిపారు. పోలింగ్ సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, నిర్ణీత సమయంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభిస్తామని చెప్పారు.

### డాక్టరేట్ ప్రదానం

తిరుపతి, (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ బయో టెక్నాలజీ స్కాలర్ ఆర్.దుర్గ డాక్టరేట్ పొందారు. ఎఫెక్ట్ ఆఫ్ సెలెక్టెడ్ ప్రొబయోటెక్స్ ఆన్ ద ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ టార్గెట్ జీన్స్ ఇన్ బ్రెస్ట్ క్యాన్సర్ అంశంపై డాక్టర్ సునీత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

## పల్లె రోడ్లు ఇలా... ప్రయాణమెలా?


అడుగడుగునా గుంతలతో బురదమయంగా ఉన్న కొత్తపల్లిరోడ్డు

దక్కిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో నేడవి గుంతమయంగా మారి ప్రజలకు నరకం చూపుతున్నాయి. మండలంలోని వెల్లికల్లు - కొత్తపల్లి, డి.వడ్డిపల్లి - కలుజుగుంట, వెంబులూరు - డి.వడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి - పాతనాలపాడు హరుందతీవాడ, కేబీపల్లి - దందవోలు రోడ్డు, దగ్గవోలు - రేగడపల్లి, ఆల్తూరుపాడు - అత్తల పసిద్దవరం గ్రామాల రహదారులు దుస్థితికి చేరాయి. అడు గుడుగునా గుంతలుపడి చినుకు పడితే అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితికి చేరుకున్నాయి. అత్తలసిద్దవరం, కొత్తపల్లి గ్రామాలకు ఆటోలు కూడా ప్రయాణించలేకపోవడంతో మండల కేంద్రానికి చేరుకోవాలంటే గ్రామస్తులకు కాలినడకే శరణ్యంగా మారింది. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే 108 వాహనం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నైనా తమ గ్రామాల రోడ్లను బాగు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలి: పాశిం


ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవితం గడపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అలఘనాథస్వామి ఆలయంలో వాహనశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలఘనాథస్వామిగుడి ఎంతో ప్రాచీనమైనదన్నారు. ఈ ఆలయంలో శిథిలావస్థకు చేరుకున్న వాహనశాలను తొలగించి దాతల సాయంతో నూతన భవన నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. త్వరలోనే పట్టణంలోని ప్రసిద్ధ ఆలయాలకు కమిటీలను నియమించి ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, మునిగిరీష్, బత్తిన సుధాకర్, రవీంద్రరెడ్డి, రమేష్, ఓంప్రకాష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జిల పాలన ఎన్నాళ్లు?

### ఏపీఎం లేకపోవడంతో సీసీల ఇష్టారాజ్యం



వెలుగు కార్యాలయం - ఖాళీగా ఉన్న ఏపీఎం కుర్చీ

బాలాయపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం లేకపోవడంతో గత రెండేళ్లుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. పక్క మండలాలకు చెందిన ఏపీఎంలను ఇన్‌చార్జిలుగా నియమించడంతో వారు బాలాయపల్లి కార్యాలయానికి రాకుండా స్థానికంగా పనిచేస్తున్న సీసీలకు బాధ్యతలు అప్పజెప్పి పనులు చక్కబెట్టడం పరిపాటిగా మారింది. దీంతో మండలంలోని పొదుపు సంఘాల సభ్యులు తమ సమస్యలు చెప్పుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఏపీఎం లేకపోవడంతో సీసీల ఇష్టారాజ్యంగా మారింది. ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఏపీఎంను నియమించాలని పొదుపు సంఘాల సభ్యులు కోరుతున్నారు.

### కోటలో ఉచిత కంటి వైద్య శిబిరం


రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ భావన, డాక్టర్ రచన 180మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 100 మందికి ఉచితంగా మందులు, 60 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అదే విధంగా 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అండమాన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


సమావేశంలో టీడీపీ నాయకులు

దక్కిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ దీవుల్లో 60 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పెట్టుకొన్నట్లు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు తెలిపారు. అండమాన్ నికోబార్ దీవుల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి అయిన ఆయన ఆదివారం ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ అధ్యక్షుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా సభ్యత్వ నమోదు ఆలస్యం అవుతోందన్నారు. త్వరలో ఇబ్బందులను అధిగమించి సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడుతో పాటు అండమాన్ నికోబార్ దీవులకు చెందిన టీడీపీ నేతలు పాల్గొన్నట్లు వివరించారు.

### పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో ఆదివారం పేదలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, మురళి, ప్రభాకర్, దయాకర్, రాము, నాగరాజు, రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీహాలులో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చెకుముఖి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రసంశాపత్రాలతో విద్యార్థులు

నాయుడుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో జరిగిన చెకుముఖి టాలెంట్ టెస్టులో నాయుడుపేట విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థి ఎ.సాయిరాజ్, 9వ తరగతి విద్యార్థి ఎ.ప్రదీప్‌రాజ్, 8వ తరగతి విద్యార్థి ఎం.జాయి ప్రీతీష్ జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం సాధించారు. విద్యార్థులకు ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ ప్రసంశా పత్రాలను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మధుసూదన్‌ను అభినందించారు.

### భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా రాజారెడ్డి



పెళ్లకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన పాదర్తి రాజారెడ్డి భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రాజారెడ్డిని ఏకగ్రీవంగా నియమించారు. ఆయన నియమాకం పట్ల భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కోశాధికారి తుమ్మతోటి ముని హర్షం వ్యక్తం చేశారు.

### స్థలం విషయంలో ఘర్షణ

### నలుగురికి గాయాలు

తడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కారూరు గ్రామానికి చెందిన ఆంబాకం చంద్రన్, ఆంబాకం బాబు అన్నదమ్ములు. ఇటీవల వారి తండ్రి మరణించడంతో ఆయనకు సంబంధించిన స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆ స్థలం మొత్తాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో ఆదివారం బాబు ప్రహరీ నిర్మించడానికి ప్రయత్నించడంతో చంద్రన్ అడ్డుకున్నాడు. దీంతో బాబు కుటుంబసభ్యులు గడ్డపార, కర్రలతో చంద్రన్‌తో పాటు అతని కుటుంబసభ్యులపై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రన్, అతని భార్య, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో గ్రామానికి చేరుకొని క్షతగాత్రులను తడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసివున్న ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన ఆదివారం సూళ్లూరుపేటలో చోటు చేసుకొంది. పట్టణానికి చెందిన దేవత బాలాజి తన ఎలక్ట్రిక్ బైక్‌ను మున్సిపాలిటీ కార్యాలయం వెనుక ఉన్న బాలాంజనేయస్వామి ఆలయం వద్ద పార్కింగ్ చేసి ఆలయంలో పూజకు వెళ్లాడు. ఒక్కసారిగా బైక్‌లో మంటలు రావడంతో అక్కడున్న వారందరూ భయాందళనకు గురయ్యారు. మంటలు బాగా వ్యాపించి బైక్ పూర్తిగా దగ్ధమైంది.

### చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సందడి


చెంగాళమ్మ ఆలయం వద్ద భక్తుల పూజలు

సూళ్లూరుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకొనే వారు, దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా రద్దీ నెలకొంది. స్థానికులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చి భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు.

### ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


చెందోడులో సభ్యత్వ నమోదు చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వడ్డిపాళెం, దళితవాడ, నీలగిరి సంఘం కాలనీల్లో పర్యటించి టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, బీమా సౌకర్యాలను వివరించారు. 100 మందికి ఆన్‌లైన్ సభ్యత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయ, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### దీపావళికి ముందే ధరల మోతలా: వైసీపీ

కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను భారీగా పెంచి పేదల నడ్డి విరుస్తోందని వైసీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. విద్యానగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దీపావళి పండుగకు ముందుగానే వంట నూనె ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు.


















## 1న సామూహిక కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నవంబరు 1న సామూహిక కేదార గౌరీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ మండపంలో ఉదయం 7గంటల నుంచి వ్రతం జరుగుతుందన్నారు.

## ఘనంగా ఆయుధ పూజ

బుచ్చినాయుడుకండ్రిగ / ఏర్పేడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఏఈ చలపతి ఆధ్వర్యంలో ఆయుధ పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సబ్‌స్టేషన్‌ను పూలతో అలంకరించి దేవుడి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లుకు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. అనంతరం టెంకాయలను కొట్టారు. సిబ్బంది సహా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఏర్పేడు సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఆయుధపూజను ఘనంగా నిర్వహించారు. జయరామయ్య, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం




తొట్టంబేడులో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న గాలి మురళీనాయుడు - కాళంగిలో సభ్యత్వం చేయిస్తున్న టీడీపీ మండల నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు పంచాయతీలో ఆదివారం టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ మం డల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు తెలిపారు. శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష చెల్లించవచ్చు న్నారు. అదేవిధంగా రూ.100 చెల్లించి క్రి యాశీల సభ్యత్వం పొందాలన్నారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుం దని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, వెంకటేష్, సునీల్‌కుమార్, లోకేష్, దామోదరం, ధనలక్ష్మి, లక్ష్మమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### జోరుగా టీడీపీ సభ్యత్వం

కేవీబీపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం జోరుగా సాగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు చె ప్పారు. ఆదివారం కాళంగి, ఆదరం గ్రామాల్లో 4వ క్లస్టర్ ఇన్‌చార్జి గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... కొత్త ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో సీఎం చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. సురేష్‌రెడ్డి, రాజారెడ్డి, మస్తాన్‌రావు, సురేష్, రమణయ్య మోహన్‌బాబు, శేఖర్, గోపి, బీజేపీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముక్కంటీశుడి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద బాంబే హైకోర్టు న్యాయమూర్తి మంగేష్ పటేల్ కుటుంబీకులు - విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ - శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కింటీశుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి ఎస్.మంగేష్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏర్పేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల 2004-05 సంవత్సర టెన్త్ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యను నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా అప్పటి ప్రధానపాధ్యాయులు రాఘవయ్య, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రాజవేలు, ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. తమ చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఏర్పేడులోని పోలీస్‌స్టేషన్ వద్ద 2017లో ఇసుక అక్రమ రవాణాపై పోరాడుతూ లారీ ప్రమాదంలో మృతి చెందిన 16మంది రైతుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

## అక్రమ నిర్మాణం అడ్డగింత



రేణిగుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇంటిని నిర్మిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి పాత విమానాశ్రయం రోడ్డు కొత్త హైవేకే ఆనుకుని ఉన్న కొత్తపాళెం సర్వే నెం.104లో పశువుల మేత భూమిలో ఇంటిని నిర్మించేందుకు గోతులు తవ్వి సిమెంటురాళ్లు, ఇసుకను సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న వీఆర్వో శంకర్ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకునే లోగా ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తులు జారుకున్నారు.

## 104 సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపండి



సమావేశంలో ప్రసంగిస్తున్న అమర్‌నాథ్

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బకాయి వేతనాలను చెల్లించి 104 సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపాలని సీఐటీయూ అనుబంధ 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత మూడు నెలలుగా జీతాలు అందక అప్పు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2005 నుంచి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని... 2020 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో కోశాధికారి భువనేశ్వరి, మురళీమోహన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## సీసీఆర్ రాష్ట్ర కార్యదర్శిగా త్యాగరాజు

వరదయ్యపాళెం, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ రైట్స్ సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా మండలానికి చెందిన గుత్తి త్యాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం తిరుపతిలో జరిగిన సమావేశంలో సీసీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ పౌర హక్కు లపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

## మద్యం సీసాల స్వాధీనం

వరదయ్యపాళెం, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): మద్యం దుకాణం నుంచి అక్రమంగా కొనుగోలు చేసి పల్లెలో విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. దొరవారిసత్రానికి చెందిన సుబ్రహ్మణ్యం శనివారం రాత్రి వరదయ్యపాళెం లోని ఓ మద్యం దుకాణం నుంచి 25 మద్యం సీసాలను కొనుగోలు చేసి బెల్టు దుకాణంలో విక్రయించడానికి తరలిస్తుండగా ఎస్ఐ మల్లికార్జున్ సిబ్బందితో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## బాల్య వివాహం అడ్డగింత

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బాల వివాహాన్ని ప్రగతి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు అడ్డుకున్నారు. బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిపించేందుకు పెద్దలు ఏర్పాట్లు చేశారు. సమాచారం తెలుసుకున్న ప్రగతి కోఆర్డినేటర్లు రాజారెడ్డి, నారాయణ మహిళా పోలీసుతో కలిసి గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకు న్నారు. అనంతరం శ్రీకాళహస్తి రూరల్ పోలీ సులకు సమాచారం అందించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి అదే విధంగా ఐఆర్‌ను ప్రకటించి అన్ని బకాయిలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. పట్టణంలోనీ ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం 11వ పీఆర్సీని రివర్స్ చేసి జీతాలు తగ్గించి అన్యాయం చేసిందన్నారు. నూతన ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కమిషన్ వేసీ ఐఆర్ ప్రకటించాలన్నారు. వెంకటాద్రి, సుధాకర్, చెంచురాజు తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక



సుధాకర్‌రెడ్డి, రవికుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ తొట్టంబేడు మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా డిల్లీబాబు ఎన్నికయ్యారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిర్మల ఆధ్వ ర్యంలో ఎన్నిక జరిగింది.

## హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు అభినందనీయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27: హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు అభినందనీయమని 1టౌన్ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని నగరివీధిలో ఉన్న సంస్థ వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. తనను ఈ సేవా కార్యక్రమంలో భాగస్వామిని చేయడం సంతోషకంగా ఉంద న్నారు. మునీర్‌బాషా, షాకీరాలీ, రాజేశ్వర రావు, జి.రమేష్‌బాబు, సభ్యులు డిల్లీబాబు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.













